జిల్లా ప్రజలకు షబ్బే-బరాత్ శుభాకాంక్షలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట, ఫిబ్రవరి 24: షబ్బే-బరాత్ పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా ముస్లిం సోదరులంతా రెండు రోజులపాటు ఉపవాస దీక్షలు చేయడంతో పాటు రాత్రంతా జాగారం చేసి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరూ సంతోషాలతో ఉండాలని అల్లాను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

మహంకాళి ఆలయంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రైతులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, ఫిబ్రవరి 24: రైతులను, పేదలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. శనివారం దుబ్బాక మండలం రఘోత్తంపల్లిలో మహంకాళి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలను పట్టించుకోకుండా కాంగ్రెస్ నాయకులు హంగు ఆర్భాటాలకు పరిమితమయ్యారని మండిపడ్డారు. ప్రస్తుతం గ్రామాల్లో సాగునీరు లేక, కరెంట్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మల్లన్నసాగర్ కాల్వల నిర్మాణం పూర్తి చేయకపోవడంతో దుబ్బాక నియోజకవర్గంలోని రైతులకు సాగునీటి సమస్య తలెత్తిందన్నారు. నాణ్యతలేని కోతల కరెంట్‌తో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతు సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో డిపాజిట్‌రాని ఓ కాంగ్రెస్ నాయకుడు దుబ్బాక నియోజకవర్గంలో 'ప్రొసీడింగ్ కాపీలు' పట్టుకుని హంగామా చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. ప్రొటోకాల్ పాటించకుండా అభివృద్ధి కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొనడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు.



హుస్నాబాద్ సమ్మక్క జాతరలో గద్దెల వద్ద భక్తుల సందడి

జనం నుంచి వనంలోకి..

- వన ప్రవేశం చేసిన సమ్మక్క-సారలమ్మ దేవతలు
- చివరిరోజు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 24: వనదేవతలకు జనంలో నుంచి వనంలోకి వెళ్లారు. రెండు రోజులపాటు భక్తులకు దర్శనమిచ్చిన సమక్క-సారలమ్మ దేవతలు జాతర అనంతరం శనివారం వన ప్రవేశం చేశారు. ఈనెల 21న మొదలైన జాతర కోయ పూజారుల ఆధ్వర్యంలో అమ్మవార్లను వన ప్రవేశం చేయించడంతో ముగిశాయి. చివరిరోజు జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. హుస్నాబాద్‌లోని ఎల్లమ్మచెరువు వద్ద, మండలంలోని పొట్లపల్లి గ్రామం, అక్కన్నపేట మండలం గోవర్ధనగిరిలో సమ్మక్క జాతర నాలుగు రోజులపాటు జరిగింది. భక్తులు అమ్మవార్లకు బంగారం, పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

కూటిగల్‌లో...

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 24: ఈనెల 21న ప్రారంభమైన కూటిగల్ సమ్మక్క-సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. నాలుగు రోజుల పాటు భక్తుల పూజలందుకున్న వనదేవతలు జనంలో నుంచి తిరిగి వనంలోకి చేరుకున్నారు. డప్పుచప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య కోయపూజారులు తమ సాంప్రదాయ ప్రకారం వనంలోకి తీసుకెళ్లగా, భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతరను విజయవంతం చేసిన భక్తులకు, సహకరించిన అధికారులకు జాతర కమిటీ చైర్మన్ కొండూరి శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సాగునీటి కాల్వ పనులు ప్రారంభం

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపిన రైతులు

సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నకోడూర్, ఫిబ్రవరి 24: చిన్నకోడూర్ గ్రామం బెల్లకుంట ప్రాంతం రైతులు తమ పంటలు ఎండిపోతున్నాయని రంగనాయకసాగర్ ఎడమ కాల్వ నుంచి నీళ్లు వదలాలని 20 రోజులుగా ఇరిగేషన్ అధికారుల చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఇటీవల రైతులతో ఫోన్‌లో మాట్లాడి కాల్వ పనులను త్వరలో ప్రారంభించుకుందామని హామీ ఇచ్చారు. ఈ మేరకు శనివారం హరీశ్‌రావు తన సొంత డబ్బులు వెచ్చించి చిన్నకోడూరు మండల కేంద్రంలో సాగునీటి కాల్వ పనులను ప్రారంభించారు. దీంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చిన్నకోడూర్ సర్పంచ్ కాముని ఉమేష్‌చంద్ర, రెడ్డి రాజిరెడ్డి, గోపాల్ రాజేశం, జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, ఏదుల మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గోపయ్య, లాలీ, రాగిరి సాయి, శ్రీశైలం, మన్నె ఆనంద్, కొలను రఘువర్మ, అవినాష్, షాట్ రాజు, శరత్‌బాబు, కుందేలు శరత్ తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను సక్సెస్ చేయాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్

సిద్దిపేట, ఫిబ్రవరి 24: మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమం విజయంతం చేయాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులకు సూచించారు. శనివారం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో పల్స్ పోలియో ఇమ్యూనైజేషన్ ప్రోగ్రాంపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలోని 2,96,352 ఇండ్లను సందర్శించి 82,075 మంది 0-5 ఏండ్ల పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 37 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 194 ఉపకేంద్రాల పరిధిలో 717 బూతులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 306 హైరిస్క్ ప్రాంతాలుగా గుర్తించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వందశాతం పిల్లలకు పోలియో చుక్కలు వేయాలన్నారు. హైరిస్క్ ప్రాంతాలను కవర్ చేయడానికి 37 మొబైల్ టీములను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం 122 సూపర్‌వైజర్లు, 2977 వాక్సినేటర్లను నియమించామని చెప్పారు. విద్యుత్ అధికారులు ఈనెల 28 నుంచి వచ్చేనెల 5 వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పవర్ కట్ లేకుండా చూడాలన్నారు. అనంతరం స్టేట్ సర్వలెన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మురారి రాజేంద్రప్రసాద్ పల్స్ పోలియో కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ కాశీనాథ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ విజయరాణి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రజిని, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ మల్లేశ్వరి, డాక్టర్ ప్రభాకర్, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, డీడబ్ల్యూవో సవిత, మున్సిపల్ కమిషనర్లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

శిశు మరణాలపై సమీక్షా సమావేశం..

శిశు మరణాల నివారణకు చర్యలు చేపట్టాలని, గర్భిణులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ అధికారులకు సూచించారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్‌లో శిశు మరణాలపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్యశాఖ, మహిళా, శిశు సంక్షేమశాఖ మీటింగ్ ఏర్పాటు చేసుకొని శిశు మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా అధికారులు

కలెక్టరేట్‌లో అభినందన సభ

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 24 : కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్‌గా మిక్కిలినేని మనుచౌదరి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శిగా, నీటిపారుదల అండ్ కమాండ్ ఏరియా అభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. మేరకు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ జీవన్‌పాటిల్ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేయడం ప్రత్యేక అనుభూతి ఇచ్చిందన్నారు. నూతన కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి మాట్లాడుతూ ప్రశాంతమైన పరిపాలనకు మారుపేరు ప్రశాంత్ జీవన్‌పాటిల్ అని అన్నారు. అధికారుల సమన్వయంతో సిద్దిపేటను అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తానన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దంపతులు

కనుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

హుస్నాబాద్, ఫిబ్రవరి 24: హుజూరాబాద్ మండలం సింగాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా సాగింది. ఈ వేడుకలకు రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు దంపతులతోపాటు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ దంపతులు హాజరయ్యారు. సింగాపురం గ్రామంతోపాటు చుట్టుపక్కల గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కోనాయిపల్లిలో బ్రహ్మోత్సవాలు

నంగునూరు, ఫిబ్రవరి 24: మండల పరిధిలోని కోనాయిపల్లి పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి నిత్య హోమం, మహాపూర్ణాహుతి, బలిహరణం, అభిషేకం, చక్రస్నానం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రామలింగేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

మద్దూరు(ధూళిమిట్ట), ఫిబ్రవరి 24: ధూళిమిట్ట మండలం బెక్కల్ గ్రామంలోని రామచలక్షేత్రంలో కొలువుదీరిన భ్రమరాంబిక సహిత రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటలకు మేలుకొలుపు, 6 గంటలకు దిష్టికుంభం కార్యక్రమంతోపాటు పారునంది ఆంజనేయశర్మ వైదిక నిర్వహణలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను ఆలయ ఈవో పారునంది విశ్వనాథశర్మ పర్యవేక్షించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సిద్దాపురం శివప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజీనామా

బెజ్జంకి, ఫిబ్రవరి 24 : కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెలుకల కొండల్‌రెడ్డి శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేస్తున్నవారికి గుర్తింపు లేదని, సీనియర్ నాయకులను విస్మరించి పార్టీకి ఎలాంటి పనిచేయని వారికి పదవులు ఇస్తున్నారని ఆ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కోసం పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను గుర్తించి న్యాయం చేయాలని కోరారు. ఇకనుంచి పార్టీలో కొనసాగే ప్రసక్తే లేదన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 24: యువకుడి మృతికి కారణమైన నిందితులపై చర్యలు తీసుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఎగొండస్వామి, జిల్లా కార్యదర్శి వేణు పోలీసులను కోరారు. శనివారం మండల పరిధిలోని దాతర్‌పల్లిలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నితిన్ కుటుంబ సభ్యులను వారు వారు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దాతర్‌పల్లి గ్రామానికి చెందిన దళిత యువతిని జగదేవ్‌పూర్ మండలం బీజీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ కులానికి చెందిన నితిన్ కులాంతర వివాహం చేసుకున్నాడు. నితిన్ కొంతకాలంగా ప్రజ్ఞాపూర్‌లోని పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాడు. అయితే, పెట్రోల్ బంక్ యాజమాని నితిన్ డబ్బులు తీశాడని అపనింద వేయడంతో మనస్తాపానికి గురై నితిన్ ఆత్మహత్య చేసుకున్నాడు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 24: రాష్ట్ర, కేంద్ర స్థాయి ఉద్యోగాలకు సిద్దిపేట ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సు ద్వారా ఐదు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధిశాఖ అధికారి కవిత శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఉచిత శిక్షణ కోసం ఇప్పటికే దరఖాస్తులు ప్రారంభించామని, మార్చి 6 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. మార్చి 7 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు. మార్చి 10న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు.

లారీ ఢీకొని బాలుడు మృతి

కుకునూర్‌పల్లి, ఫిబ్రవరి 24: లారీ ఢీకొని బాలుడు మృతిచెందిన ఘటన గజ్వేల్ మండలం కొడకండ్ల రాజీవ్ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం గొల్లపల్లికి చెందిన గొల్లపల్లి రాములు అతడి భార్య లక్ష్మి, మనవడు సాత్విక్‌తో కలిసి టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గొల్లపల్లి నుంచి నాగిరెడ్డిపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కొడకండ్ల వద్ద రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ బలంగా ఢీకొనడంతో ముగ్గురికి తీవ్రగాయాయ్యాయి. స్థానికులు గమనించి వారిని గజ్వేల్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బాలుడు సాత్విక్(15) మృతి చెందాడు. రాములు, లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం ఆర్‌వీఎం దవాఖానకు తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

పట్టు పరిశ్రమతో బహుళ ప్రయోజనాలు

విద్యార్థులకు సెరికల్చర్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తున్న సైంటిస్ట్ వినోద్‌కుమార్

ములుగు, ఫిబ్రవరి 24: పట్టు పరిశ్రమ ఏర్పాటుతో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఆర్ఎస్ఆర్ఎస్ (రూరల్ సెరికల్చర్ రీసెర్చ్ సెంటర్) సీనియర్ సైంటిస్టులు డాక్టర్ వినోద్‌కుమార్‌యాదవ్, డాక్టర్ రాఘవేందర్ అన్నారు. శనివారం ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో రూరల్ సెరికల్చర్ రీసెర్చ్ సెంటర్, సెంట్రల్ సిల్క్ బోర్డు, టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెరికల్చర్ టెక్నాలజీపై విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పట్టుపురుగులలో అనేక వాణిజ్య జాతులున్నా దేశీయ పట్టుపురుగు అధిక ప్రాముఖ్యత కలిగి ఉందన్నారు. పట్టుపురుగుల పెంపకంలో అవగాహన కలిగి ఉండాలి. మల్బరీ ఆకులు తింటూ పెరిగే ఈ ఆడ పట్టుపురుగు 300 నుంచి 500 గుడ్లు పెడుతుందన్నారు. కార్యక్రమంలో అటవీ కళాశాల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జీసీఎల్ క్రికెట్ టోర్నీ ఏర్పాటు

క్రీడాకారులకు జెర్సీలు అందజేస్తున్న ఎన్సీ సంతోష్

గజ్వేల్ అర్బన్, ఫిబ్రవరి 24: ఐపీఎల్ తరహాలో గజ్వేల్ క్రికెట్ క్రీడాకారులు జీసీఎల్ ఏర్పాటు చేశారు. శనివారం పట్టణంలో జీసీఎల్ క్రికెట్ టోర్నీని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్సీ సంతోష్ ప్రారంభించి క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో జీసీఎల్ ఏర్పాటు చేయాలన్న ఆలోచన చాలా అద్భుతంగా ఉందన్నారు. క్రీడాకారుల్లో పోటీతత్వాన్ని పెంచి వారిలో నైపుణ్యాన్ని పెంపొందించడానికి జీపీఎల్ దోహదపడుతుందన్నారు. ఎఫ్ఎఫ్‌యూ సభ్యులు ఆరీఫ్, ప్రవీణ్, విష్ణువర్ధన్‌రెడ్డి, నిర్వాహకుడు సూర్యప్రకాశ్‌రెడ్డి, నాయకులు కరీం, స్వామి, క్రీడాకారులు రవి, ఖాజాపాషా, భరత్, సాయి, రమేశ్, సతీశ్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 24 : టెన్త్ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. అన్ని కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు చూసుకోవాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. సమావేశంలో పోలీసు, విద్యుత్ శాఖ, ఆర్టీసీ, ఆరోగ్యశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

రాయపోల్, ఫిబ్రవరి 24: మనిషి మనుగడకు చదువు చాలా ముఖ్యమని, చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని తొగుట సీఐ లతీఫ్ అన్నారు. శనివారం దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని అందుకు అనుగుణంగా కష్టపడి చదవాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసలై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. సెల్‌ఫోన్లు అవసరం మేరకు మాత్రమే ఉపయోగించుకోవాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వ్యక్తిగత వివరాలు చెప్పొద్దన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930 కాల్ చేసి చెప్పాలన్నారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎస్సై ప్రేమ్‌దీప్, ప్రిన్సిపాల్ సురేశ్‌రెడ్డి, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

మిరుదొడ్డి (అక్బర్‌పేట -భూంపల్లి), ఫిబ్రవరి 24 : విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భూంపల్లి ఎస్సై భువనేశ్వర్‌రావు ఆకాంక్షించారు. శనివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు కన్న కలలను సాకారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా ఆరోపణలు అవాస్తవం

- ఆరోపణలు చేసినవారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం
- కౌన్సిలర్‌గా, చైర్మన్‌గా 20 ఏండ్ల నుంచి పట్టణంలో ప్రభుత్వ ఆస్తిని కాపాడుతున్నాం
- కొంతమంది మున్సిపల్ స్థలాన్ని కులాల పేరుతో ఆక్రమించుకోవాలని చూస్తున్నారు
- సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు

సిద్దిపేట, ఫిబ్రవరి 24: పట్టణంలోని పాత ఫిషరీస్ కార్యాలయ స్థలం విషయంలో తమపై వచ్చిన ఆరోపణల్లో ఏ మాత్రం నిజం లేదని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, కౌన్సిలర్ లక్ష్మణ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 2022లో పాత ఫిషరీస్ కార్యాలయం మార్చిన తర్వాత ఆ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగిస్తూ అప్పటి అడిషనల్ కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌కు లీగల్‌గా లెటర్ ఇచ్చారని తెలిపారు. పాత ఫిషరీస్ కార్యాలయం వెనకాల ప్రభుత్వానికి సంబంధించిన భూమి ఉందన్నారు. సిద్దిపేట మున్సిపాలిటీకి కలెక్టర్ కార్యాలయం ద్వారా ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ వారు అప్పగించిన స్థలానికి ఫెన్సింగ్ కూడా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేయించామని చెప్పారు. అయితే, ఈ స్థలం వెనకాల ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరూ కుల సంఘాల పేరుతో కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ విషయంపై ఇప్పటికే ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామన్నారు. నిన్న తనతోపాటు ఓ కౌన్సిలర్ స్థలాన్ని కబ్జా చేస్తున్నట్టుగా వచ్చిన ఆరోపణలు అవాస్తవమని తెలిపారు. తమపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. 20 ఏండ్లుగా సిద్దిపేట మున్సిపాలిటీలో కౌన్సిలర్‌గా, చైర్మన్‌గా పనిచేశానని, ఇప్పటివరకు ఎలాంటి ఆరోపణలు తనపై లేవని గుర్తుచేశారు. తమపై అసత్య ఆరోపణలు మానుకోవాలని సూచించారు. లేదంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్లు బ్రహ్మం, సుందర్, చంద్రం, యెగీశ్వర్, విజేందర్‌రెడ్డి, సాయిశ్వర్ గౌడ్, మల్లికార్జున్, సాయి, నాగరాజురెడ్డి, అరవింద్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

చిన్నారిని హతమార్చిన మేనమామ

- హత్య చేసిన వ్యక్తిని చితకబాదిన గ్రామస్తులు

మృతిచెందిన చిన్నారి శిరీష

నంగునూరు, ఫిబ్రవరి 24 : మతిస్థిమితం లేని వ్యక్తి తన మేనకోడల్ని చంపిన ఘటన మండల పరిధిలోని బద్దిపడగ గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం.. మందపల్లి గ్రామానికి చెందిన పట్టే కులస్తులు.. మామిడి తోటలు పట్టుకునేందుకు కొన్ని రోజుల క్రితం బద్దిపడగ గ్రామానికి వచ్చి వేముల శ్రీధర్‌రెడ్డికి చెందిన మామిడి తోటలో నివాసం ఉంటున్నారు. అదే మామిడి తోటను లీజుకు తీసుకున్నారు. గుజరాతి రాజు-సంతోష దంపతుల కూతురు శిరీష(4) బాలిక ఆడుకుంటుండగా మేనమామ శ్రీను నాటు వేసిన బురద నీటిలో ముంచడంతో ఊపిరాడక మృతిచెందింది. దీంతో గ్రామస్తులు అతడిని చితకబాది పోలీసులకు అప్పగించారు. అయితే, కాయ శ్రీనుకు మతిస్థిమితం లేదని గ్రామస్తులు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

మద్యం (ఆల్కహాల్) మాన్పించబడును

★త్రాగుడు (ఆల్కహాల్) & సిగరెట్, గుట్కా మానండి, మాన్పించండి. త్రాగేవారికి తెలియకుండా ఆయుర్వేద మందుతో మాన్పించవచ్చు. సైడ్ ఎఫెక్ట్స్ లేవు. కేంద్రీయ ఆయుర్వేద. ఫోన్: 9652899899. NT-319957-All

ప్లాట్లు కొనబడును

★హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, పసుమాముల, రామోజీ, కోహెడ, సాగర్ పంపు, గుంతపల్లి, బాటసింగారం, తూప్రాన్‌పేట్, మల్కాపురం, పోచంపల్లిలో ప్లాట్లు కొనబడును. J.సుధాకర్ గౌడ్: 9948172307, 9390846522. NT-313886-All

FLAT FOR SALE

★ప్రజ్ఞాపూర్ కరీంనగర్ హైవే ప్రక్కన తక్కువ బడ్జెట్‌లో Luxury అపార్ట్‌మెంట్‌లో Flats కలవు.